www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ..

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పట్టుదల, క్రమశిక్షణతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలి: ఎస్పీ రోహిత్ రాజు



హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 283 బుధవారం 11-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

ఎల్‌నినో కరువు ప్రభావం..

- పశుసంపద సంరక్షణకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ!
- పశుగ్రాస సాగుకు రైతులకు 100 శాతం ప్రభుత్వ ఆర్థిక సాయం
- పశువులు, గొర్రెలు, మేకలకు తాగునీటి కోసం నీటి తొట్ల నిర్మాణం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ, కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ జిల్లాలో పశుసంపద సంరక్షణకు కలెక్టర్ అంకిత్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. కరువు

మిగతా 5లో..

Fodder Cultivation





మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి!

మారుమూల గ్రామాల అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు చేరాలి
- చిన్నరాయిగూడెంలో భూముల రీసర్వే పరిశీలన
- గ్రామంలో 1,395 ఎకరాల భూమి.. 554 ఎకరాలు అటవీ భూమి
- పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలపై రైతుల వినతి
- రెవెన్యూ, అటవీ భూముల హద్దులపై స్పష్టతకు ఆదేశం
- రైతుల భూ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి

మణుగూరు, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

మారుమూల, సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు ప్రతి మారుమూల గ్రామానికి చేరేలా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మంగళవారం మణుగూరు మండలం చిన్నరాయిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ, అటవీ భూముల హద్దులు, భూముల విస్తీర్ణం, సర్వే పురోగతిపై సర్వేయర్లను అడిగి

మిగతా 6లో..

పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం సహించేది లేదు!

- నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలులో నిర్లక్ష్యం వద్దు
- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా.. నేరస్తుల ఆస్తుల జప్తుకు చర్యలు



రైతాంగ సమస్యలపై సమరశంఖం.. కిసాన్ సభ మహాసభలకు సిద్ధం!

- నవంబర్ 15న నల్గొండలో భారీ రైతు బహిరంగ సభ..
- రైతులు లక్షలాదిగా తరలిరావాలి: భూక్య వీరభద్రం పిలుపు

కారేపల్లి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ పరిరక్షణ, భవిష్యత్తు రైతు ఉద్యమాల కార్యాచరణే లక్ష్యంగా నవంబర్ 15 నుంచి 18 వరకు తెలంగాణలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను

మిగతా 4లో..



రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు బీఎస్పీ సమరశంఖం!



- నవంబర్ 26న చర్లలో బహుజనుల భారీ గర్జనకు సిద్ధం..
- రాజ్యాంగ విలువలపై ప్రజల్లో చైతన్యమే లక్ష్యం!
- భారీ సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకుల పిలుపు..
- క్షేత్రస్థాయిలో ప్రచారానికి శ్రీకారం.. మల్లారంలో కరపత్రాల విడుదల

చర్ల, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి ప్రజాస్వామ్య మౌలిక విలువలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్ధమవుతోంది. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బహుజన సమాజాన్ని చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా నవంబర్ 26న చర్ల మండల కేంద్రంలో భారీ రాజ్యాంగ ఆమోద దినోత్సవ సదస్సు నిర్వహించేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా, డివిజన్, మండల నాయకులు పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో సదస్సు ప్రచార కార్యక్రమానికి మల్లారం గ్రామంలో శ్రీకారం చుట్టారు. బీఎస్పీ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు చెన్నం మోహన్, చర్ల మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం రాజ్యాంగ ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలనే లక్ష్యంతో

మిగతా 2లో..

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని

- **ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలిచి ప్రగాఢ సానుభూతి**

సుజాతనగర్, నవంబర్ 10(భద్రాద్రిన్యూస్)

:ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలను పరామర్శించి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మానవీయతను చాటుకున్నారు. సింగభూపాలెం గ్రామానికి చెందిన ఏఐటీయూసీ మాజీ నాయకుడు పొదిలా సర్వేశ్వరరావు (52) అనారోగ్యంతో మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన పుట్టపర్తి భారతి, సుజాతనగర్ గ్రామానికి చెందిన చిట్లూరి భద్రరావు అనారోగ్యంతో కన్నుమూశారు.

కార్మిక సంఘ నాయకుడిగా సేవలందించిన సర్వేశ్వరరావు మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా భద్రరావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ముగ్గురి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, సుజాతనగర్ సీపీఐ నాయకులతో కలిసి మృతుల నివాసాలకు వెళ్లారు. పార్థివదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కుమారి వీర హనుమంతరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, పొదిల శ్రీను, ఉపసర్పంచ్ గోరంట్ల ధర్మ, జాన్ విక్టర్, మాజీ ఎంపీటీసీ మురళి, భూక్య శ్రీను, దండు నాగేశ్వరరావు, మండే నాగేశ్వరరావు, కుమారి కృష్ణ, దండు సురేష్, బొడ్డు కేశవరావు, కసన బోయిన వెంకన్న, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు బీఎస్పీ సమరశంఖం!

మొదటిపేజీ తరువాయి

ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి కేసుపాక కృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వీసంపల్లి నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలిచిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని పేర్కొన్నారు.

1949 నవంబర్ 26 భారత చరిత్రలో చిరస్మరణీయమైన రోజు అని, ఇదే రోజున రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని గుర్తుచేశారు. ఎన్నో సంవత్సరాల పోరాటాలు, త్యాగాలు, మేధోమథనం ఫలితంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని వివరించారు. కులం, మతం, ప్రాంతం, భాష వంటి భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం కల్పించడమే రాజ్యాంగ ప్రధాన స్ఫూర్తి అని అన్నారు.

రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, బలహీన వర్గాలకు హక్కులను, సామాన్య ప్రజలకు న్యాయం పొందే అవకాశాన్ని కల్పించిన శక్తివంతమైన వ్యవస్థ అని నాయకులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని హక్కులు, విధులు, సామాజిక న్యాయ సూత్రాలపై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు.



ఈ నెల 26న చర్ల మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ ప్రత్యేక సదస్సుకు బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ జోనల్ ఇన్‌చార్జి దాగిళ్ల దయానంద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. ఆయన సమక్షంలో రాజ్యాంగ ఆవశ్యకత, బహుజనుల హక్కులు, సామాజిక సమానత్వం, రాజకీయ చైతన్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగాలి!

సమాజంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంపొందించడంతో పాటు వారి అభ్యున్నతికి రాజకీయ చైతన్యం ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని యువతలో పెంపొందించాలని, సమానత్వం, సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ ఆశయాలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.

ఈ సదస్సు కేవలం పార్టీ కార్యక్రమంగా కాకుండా రాజ్యాంగ ప్రాధాన్యతను చాటిచెప్పే ప్రజా చైతన్య వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించాలని సూచించారు. బీఎస్పీ శ్రేణులంతా ఐక్యంగా కదిలి నవంబర్ 26న జరిగే సదస్సుకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు ధ్రువ నరసింహారావు, కాకా నరసయ్య, సోయం శ్రీమూర్తి, దుమ్ముగూడెం మండల సీనియర్ నాయకులు కంచర్ల సింహాద్రి, తాటి మోతురి, ఇరప ధర్మరాజు, పాయల ప్రమీల, శంకర్, బోసు తదితర బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు





నీటి చుక్కే జీవధార.. కెప్టెన్ బంజారాలో ఇంకుడు గుంతల పనుల ప్రారంభం!

కామేపల్లి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జల మట్టాన్ని పెంచడమే లక్ష్యంగా కామేపల్లి మండల పరిధిలోని కెప్టెన్ బంజార గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి ఆరెం ఆచమ్మ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా ప్రారంభించారు. నీటి ఎద్దడిని నివారించడంలో ఇంకుడు గుంతల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో డి. సోమ్లాల్ నాయక్ మాట్లాడుతూ.. జల సంరక్షణే మన భవిష్యత్తుకు అసలైన భరోసాని స్పష్టం చేశారు. వర్షపు నీరు వృథాగా పోకుండా నిలిపినప్పుడే రాబోయే తరాలకు తాగు, సాగు నీటి కొరత లేకుండా చూడగలమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం పూర్తి చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ, సహాయ ప్రాజెక్టు అధికారి శ్రీరాణి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెంకటేశ్వర్లు, సాంకేతిక సహాయకులు భాస్కర్, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందితో పాటు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- **టూరిజం నోడల్ అధికారి డా . ధర్మ నాయక్**

భద్రాద్రి న్యూస్ ములుగు

గారు రామప్ప సరస్సు ఐలాండ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్ సూచించారు.మంగళవారం రామప్ప సరస్సు ఐలాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఏఈ విజయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య పాఠశాలలో ప్రకాశించిన చిన్నారి నక్షత్ర.. ఆటల పోటీలలో మొదటి బహుమతి ప్రతిభ!

పాల్వంచ, నవంబర్ 10(భద్రాద్రి న్యూస్):

పాల్వంచ పట్టణం పరిధిలోని ఓడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తాజాగా మంగళవారం నిర్వహించిన ఆటల పోటీలలో చిన్నారి, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలలో ఎల్ కే జి (LKG) తరగతి అభ్యసిస్తున్న చిరునవ్వుల విద్యార్థిని మొల్లుగూరి నక్షత్ర అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న నక్షత్ర, అద్భుతమైన ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకుంటూ మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయం ద్వారా ఆమె గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) మరియు ప్రతిభ సర్టిఫికెట్‌ను గెలుచుకుంది. ప్రిన్సిపాల్ మిరియాల రాణి మరియు క్లాస్ టీచర్ చందన బహుమతులను అందజేశారు.

చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తిని కనబరుస్తూ, పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నక్షత్రను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మరియు తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల రాణి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, చిన్ననాటి నుంచే ఇలాంటి పోటీలలో పాల్గొనడం ద్వారా పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి సందీప్ (విలేఖరి), తల్లి ఎమ్ ఈశ్వరి(జెన్కో ఎంప్లాయ్) తన కుమార్తె నక్షత్ర సాధించిన ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో నక్షత్ర మరిన్నిన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ ఆకాంక్షించారు.



రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

- **వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ పలువురు మేధావులు**

వరంగల్, నవంబరు 10 (భద్రాద్రిన్యూస్):-





ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో ప్రజాస్వామ్య రక్షణ ద్వారానే ప్రజలు రక్షించబడతారని, ప్రజాస్వామ్య రక్షణలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం పచ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 6వ రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ విలువలు, రాజ్యాంగ హక్కులు, మానవీయ విలువల గూర్చి సామాన్య ప్రజలకు తెలియాల్సిన అవసరముందని, రాజకీయ పార్టీలతో అన్ని పనులు కావని, విలువలు, హక్కుల బోధనలో న్యాయవాదులు ముందుంటే ఆ సమాజంలో స్వేచ, సమానత్వం తొందరగా వస్తుందని అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కతో సహా హై కోర్టు మాజీ న్యాయమూర్తి, సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ ఈద తిరుమలదేవి, వరంగల్ జిల్లా జడ్జి వి.బి నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీత తో పాటు వివిధ రంగాల మేధావులు హాజరయ్యే ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సును ఈ నెల 14 న హనుమకొండ హంటర్ రోడ్ 'డి' కన్వెన్షన్ లో నిర్వహించడం గొప్ప విషయమని, ఈ రాష్ట్ర సదస్సుకు న్యాయవాదులు పెద్ద ఎత్తున్న హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రాంచంద్రం, డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ వై. ఎంకయ్య, లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఆదర్శ లా కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి రమేష్ లను సదస్సు ఆహ్వాన పత్రికలను అందించి ఐ ఎల్ పి ఎ ఆర్గనైజింగ్ కమిటీ ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు చేస్తున్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సులో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రం లోని అన్ని బార్ ల నుండి న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటి సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకులు విలాసాగరం సురేందర్ గౌడ్, పూసపల్లి శ్రీనివాస్, నమ్మనీ చంద్రశేఖర్, జన్ను ఆనంద్ కుమార్, జంగా స్వప్న, గురిమిల్ల రాజు, ఎలమాద్రి రవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వి. రమేష్‌కు కాంగ్రెస్ నేతల స్వాగతం!

- **మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తాం: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు**

కారేపల్లి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):



కారేపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వి. రమేష్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశారు.

అనంతరం తోటకూరి రాంబాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ విషయంలో పోలీసు శాఖకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుగులోత్ భీముడు నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బోళ్ల రమేష్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు కడియాల సుధాకర్, పార్టీ మండల సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఉద్యోగి బొజ్జ రాజు మృతి పట్ల కొత్వాల సంతాపం





- **ఆరోగ్యమాత చర్చిలో ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పించిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్**

పాల్వంచ, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

కేటీపీఎస్ ఉద్యోగి, ఇందిరానగర్ కాలనీ నివాసి బొజ్జ రాజు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పాల్వంచలోని ఆరోగ్యమాత చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో కొత్వాల పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బొజ్జ రాజు పాత పాల్వంచకు చెందిన వాసుమల్ల రాజరత్నం, వెంకటమ్మల కుమార్తె ధనలక్ష్మి భర్త.

ఈ కార్యక్రమంలో కొండం వెంకన్న గౌడ్, వాసుమల్ల సుందర్ రావు, వాసుమల్ల వీరస్వామి, వాసుమల్ల సోమయ్య, వాసుమల్ల సత్యం, వాసుమల్ల రాంబాబు, వాసుమల్ల రవి, వాసుమల్ల గౌతమ్, గడదేశి ప్రభాకర్, తంబళ్ళ వీరస్వామి, షేక్ మదార్, షేక్ బాషా, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



రైతు పంట అంటేనే మన బతుకు

- **విత్తనంపై హక్కు రైతుదే.. భూమిపై హక్కు రైతుదే.. పంటపై అధికారం రైతుదే!**
- **చలో నలగొండ 15 నుండి 18 వరకు 36వ అఖిల భారత కిసాన్ మహాసభలకు రైతులు భారీగా తరలండి**

కామేపల్లి, నవంబర్ 10(భద్రాద్రి న్యూస్):-



నిత్యజీవితంలో ఒక మనిషి జీవించడానికి గాలి,నీరు ఎంత అవసరమో ఆహారం కూడా అంతే అవసరం.ఆహారాన్ని పండించే రైతు దేశానికి వెన్నెముక. రైతు పంట పండిస్తేనే ప్రజల ఆకలి తీరుతుంది. అందుకే వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు.. దేశ సహజ వనరులను మార్చిన రైతు ఆహార భద్రతకు పునాది.కూడా

ఈ నేపథ్యంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ భారీ మహాసభల సందర్భంగా రైతాంగ హక్కులు,వ్యవసాయ సమస్యలు,రైతుల భవిష్యత్తుపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విత్తనంపై రైతు హక్కు ఉండాలి

వ్యవసాయానికి విత్తనమే మొదటి మెట్టు.అని నిరూపించిన రైతంగం. తర తరాలుగా రైతులు తమ పంటల నుంచి నాణ్యమైన విత్తనాలను సేకరించి భద్రపరచుకునేవారు.నేడు విత్తనాల ధరలు పెరగడం,నకిలీ విత్తనాల బెడద రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రైతులు తమ విత్తనాలను పరిరక్షించుకునే హక్కును ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చి కాపాడాలి.

భూమిపై రైతు హక్కురైతుకు భూమి జీవనాధారం.

భూమిని కోల్పోతే జీవనోపాధిని కోల్పోయినట్లే. చిన్న,సన్నకారు రైతులతో పాటు కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి.సాగు చేసే ప్రతి రైతుకు గుర్తింపు కార్డు వ్యవసాయ పరికరాల పనిముట్లు వారికి కావలసిన ఎరువులు అన్ని ప్రభుత్వం ద్వారా అందజేసినప్పుడే నిజమైన రైతు సహకారానికి మేలు జరుగుతుంది అని దానితోపాటు రైతులకు

రుణాలు,బీమా సౌకర్యం

ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు ప్రయోజనాలు అందాలి.

పంటకు గిట్టుబాటు ధర అవసరం విత్తనం నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతు ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నాడు.ఎరువులు,పురుగుమందులు,కూలీల ఖర్చులు పెరుగుతున్నా పంటకు సరైన ధర లభించడం లేదు. దళారుల ప్రభావం, మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు,ప్రకృతి వైపరీత్యాలు రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి.పంటకు గిట్టుబాటు ధర,పంట బీమా, సాగునీరు,విద్యుత్,నిల్వ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత.తీసుకోవాలి

మహాసభల లక్ష్యం రైతు సంక్షేమం

నల్లగొండలో జరగనున్న 36వ అఖిల భారత కిసాన్ మహాసభలు రైతుల విత్తన హక్కులు,భూమి పరిరక్షణ,కౌలు రైతుల గుర్తింపు,వ్యవసాయ కార్మికుల సంక్షేమం,రుణ సమస్యలు, పంటలకు న్యాయమైన ధర వంటి అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయాలి.

రైతు సంక్షేమం ఒక వర్గానికి సంబంధించిన సమస్య కాదు.అది యావత్ భారతభారత దేశంలోని ప్రతి పౌరుడి జీవనానికి సంబంధించిన అంశం. రైతు పండించిన పంటకు గౌరవం,రైతు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది.

ముగింపు

విత్తనంపై రైతు హక్కు ఉండాలి.. భూమిపై రైతు అధికారం కాపాడాలి.. పంటకు న్యాయమైన ధర దక్కాలి.. రైతు ఆత్మగౌరవంతో జీవించాలి.రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే దేశం బతుకుతుంది.

రైతు పంట అంటేనే మన బతుకు!

36వ అఖిల భారత కిసాన్ మహాసభలు రైతాంగ హక్కుల పరిరక్షణకు,వ్యవసాయ రంగ అభివృద్ధికి,రైతుల ఆత్మగౌరవానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తూ ఈ వ్యాసాన్ని మహాసభలకు పునర్ అభివృద్ధికి ఒక తొలిమెట్టుగా ప్రారంభం కావాలని రైతులు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని రైతే రాజు రైతు లేనిదే బుక్కడు బువ్వ దొరకదని ప్రతి ఒక్కరికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని. చేస్తున్నాను.అని వారు పేర్కొన్నారు.

వ్యాసం:-

బోడ మంగ్యాజి నాయక్

కామేపల్లి మండలం (భద్రాద్రి న్యూస్):-రిపోర్టర్

తెలంగాణ జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు!

- **విద్యుత్ అవసరాల దృష్ట్యా సరఫరా పెంపునకు సింగరేణి కీలక నిర్ణయం నైనీ గని నుంచి యాదాద్రి థర్మల్ కేంద్రానికి రోజుకు 16 వేల టన్నుల రవాణా లక్ష్యం: సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి**

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి కాలరీస్ సంస్థ నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది.

మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ మాట్లాడుతూ తెలంగాణ జెన్‌కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత మూడు, నాలుగేళ్లతో పోలిస్తే ఈ ఏడాది తెలంగాణ జెన్‌కోకు అధిక మొత్తంలో బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు మరింత పెరిగితే సింగరేణి తన ఉత్పత్తి సామర్థ్యం మేరకు అదనంగా బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఒడిశాలోని నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రస్తుతం అక్కడ మూడు లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని సీఎండీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో యాదాద్రి థర్మల్ కేంద్రానికి బొగ్గు రవాణాను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు సూచించారు.

స్థానికంగా రవాణా సమస్యల కారణంగా బొగ్గు తరలింపులో కొంత జాప్యం జరుగుతోందని తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ వివరించారు. ఈ నెలాఖరు నుంచి రోజుకు 16 వేల టన్నుల బొగ్గు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత సమావేశాల అనంతరం బొగ్గు రవాణా పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

నైనీ గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గు కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్‌కోలతో పాటు పలు ప్రైవేటు సంస్థలు కూడా విజ్ఞప్తులు చేస్తున్నాయని నైనీ జనరల్ మేనేజర్ సమావేశంలో వివరించారు. దీనిపై స్పందించిన సింగరేణి సీఎండీ, నైనీ గని బొగ్గులో మొదటి ప్రాధాన్యత తెలంగాణ జెన్‌కోకు ఇవ్వాలని, మిగిలిన బొగ్గును ఇతర సంస్థల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సరఫరా చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ బొగ్గు రవాణా విషయంలో తెలంగాణ జెన్‌కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణ జెన్‌కో డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్) నాగ్యతో పాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.



రైతాంగ సమస్యలపై సమరశంఖం.. కిసాన్ సభ మహాసభలకు సిద్ధం!

మొదటిపేజీ తరువాయి

విజయవంతం చేయాలని రైతు సంఘం వైరా డివిజన్ సహాయ కార్యదర్శి భూక్య వీరభద్రం పిలుపునిచ్చారు. మహాసభల ప్రారంభం సందర్భంగా నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న భారీ రైతు బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రైతు బహిరంగ సభ సన్నాహకంగా ఎం.డి. ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత తెలంగాణ గడ్డపై అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు, రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, వ్యవసాయ రంగ భవిష్యత్తుపై ఈ మహాసభల్లో సమగ్రంగా చర్చించి, రాబోయే పోరాటాలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ సంక్షోభంపై సమరభేరి

ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, కరువు, తుఫాన్ల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, పాడి పరిశ్రమ, ఆక్వా రంగాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అంతర్జాతీయ ఒప్పందాల ప్రభావం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన అవసరంపై మహాసభల్లో చర్చించనున్నట్లు వివరించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలు చిన్న, సన్నకారు రైతుల భవిష్యత్తుకు



ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అటవీ చట్టాల పేరుతో ఆదివాసీల హక్కులకు విఘాతం కలగకుండా చూడటం, అటవీ హక్కుల చట్టం పరిరక్షణ, వ్యవసాయ కార్మికులకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయడం వంటి కీలక అంశాలు మహాసభల చర్చలో ప్రధానంగా నిలవనున్నాయని తెలిపారు. మరోవైపు ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో హామీలు ఇస్తున్న ప్రభుత్వాలు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

రైతు ఐక్యతే ఉద్యమాలకు బలం

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించి, రైతులు, వ్యవసాయ కార్మికులను ఐక్యం చేయడం ద్వారా భవిష్యత్తు ఉద్యమాలకు బలమైన పునాది వేయడమే ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమని భూక్య వీరభద్రం పేర్కొన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి రైతు భాగస్వామి కావాలని, నల్గొండలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా కాకుండా లక్షలాది మంది రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుర్గి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కె. నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, కె. ఉమావతి, కార్యదర్శివర్గ సభ్యులు రేగళ్ల మంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, పార్టీ నాయకులు కరపటి సీతారాములు, ముక్క సీతారాములు, పాసిని నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు ముండ్ల ఏకాంబరం, వల్లబోయిన కొండలరావు, గంగాధరని ఉపేందర్, ధరావత్ రవికుమార్, సీఐటీయూ నాయకురాలు వై. రాధ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం సహించేది లేదు!



- **నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలులో నిర్లక్ష్యం వద్దు**
- **గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా.. నేరస్తుల ఆస్తుల జప్తుకు చర్యలు**

కొత్తగూడెం, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం అందించాలని స్పష్టం చేశారు.

మంగళవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశానికి ఎస్పీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నేర పరిస్థితులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, కోర్టు సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షించారు.



హత్య కేసులకు సంబంధించిన పెండింగ్ దర్యాప్తులను త్వరితగతిన పూర్తి చేసి పటిష్టమైన ఆధారాలు సేకరించాలని సూచించారు. దర్యాప్తులో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను ప్రత్యేక కార్యాచరణతో అమలు చేయాలని, నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల వారీగా వారెంట్ల అమలును సమీక్షిస్తూ పెండింగ్ సంఖ్యను తగ్గించాలని స్పష్టం చేశారు.

ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల ఆర్థిక మూలాలను గుర్తించి సమగ్ర ఆర్థిక దర్యాప్తు చేపట్టాలని, అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి చట్టప్రకారం జప్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధ ప్రతిపాదనలు, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నేరస్తులపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంజాయి వినియోగదారులను గుర్తించి వైద్యుల సూచనల మేరకు డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువత, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భరోసా కేంద్రం, షీటీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలపై నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు, అదృశ్యమైన వ్యక్తుల కేసులు, రౌడీషీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు.

ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ భద్రతా సిబ్బందికి నూతన యూనిఫామ్‌ల పంపిణీ

- **మార్కెట్ కమిటీ భద్రతా సిబ్బందికి నూతన యూనిఫామ్‌ల పంపిణీ**
- **సిబ్బంది క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి: చైర్మన్ బండారు నరసింహారావు**

మధిర, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి నూతన యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు సెక్యూరిటీ గార్డులకు యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది క్రమశిక్షణతో, అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తిస్తూ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి పి. వీరాంజనేయులు, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో కరువు ప్రభావం..

మొదటిపేజీ తరువాయి

పరిస్థితుల్లో పశువులకు పచ్చిమేత, తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పశుపోషణపై ఆధారపడిన రైతులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న VBG RAM G పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ పథకంలో భాగంగా ఇంటెన్సివ్ ఫోడర్ డెవలప్‌మెంట్ (IFD) కార్యక్రమం ద్వారా రైతుల వ్యక్తిగత వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లోనూ పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయం అందించనుంది. వ్యక్తిగతంగా పశుగ్రాసం సాగు చేసుకోవాలనుకునే రైతులకు ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉండాలని, బోరు, కాలువ, చెరువు లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు.

పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి, కూలీ ఖర్చులతో సహా మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఒక ఎకరంలో పశుగ్రాసం సాగుకు రూ.18,882 అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎర్రచెంగలి, నక్కతోక గడ్డి, నీడ గడ్డి, ఉప్పు గడ్డి, ఈటె గడ్డి వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రైతులు తమ భూముల్లోనే పచ్చిమేతను అందుబాటులో ఉంచుకోవడం ద్వారా బయట నుంచి మేత కొనుగోలు చేసే ఖర్చు తగ్గుతుందని, పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడి పశుపోషణ ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు.

అదేవిధంగా కరువు పరిస్థితుల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా VBG RAM G పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నీటి తొట్ల నిర్మాణానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. పశువుల కోసం 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.6 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.34,707 అంచనా వ్యయాన్ని నిర్ణయించారు. గొర్రెలు, మేకల కోసం 10 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.3 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.43 వేల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని వివరించారు.

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపదకు అవసరమైన పచ్చిమేత, తాగునీటి సౌకర్యాలను ముందుగానే కల్పించుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస సాగుకు అనువైన భూములను, నీటి తొట్ల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

రైతులు, పశుపోషకులు ఈ ప్రభుత్వ అవకాశాలను వినియోగించుకొని తమ పశుసంపదను సంరక్షించుకోవాలని కోరారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తుల సమర్పణ కోసం సంబంధిత మండల పరిషత్ లేదా గ్రామపంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.

Fodder Cultivation





Cattle Trough

మణుగూరు ఓపెన్‌కాస్ట్ విస్తరణ బాధితులకు రూ.8.19 కోట్ల పరిహారం!

- **మణుగూరు ఓపెన్‌కాస్ట్ విస్తరణ బాధితులకు రూ.8.19 కోట్ల పరిహారం!**
- **149 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం**
- **71 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరుకు కమిటీ ఆమోదం**

కొత్తగూడెం, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

మణుగూరు ఓపెన్‌కాస్ట్ విస్తరణ ప్రాజెక్టు కారణంగా ప్రభావితమవుతున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా స్థాయి పునరావాసం, పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) కమిటీ ఆమోదం తెలిపింది. మణుగూరు గ్రామానికి చెందిన 71 కుటుంబాల్లో గుర్తించిన 149 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5.50 లక్షల చొప్పున మొత్తం రూ.8 కోట్ల 19 లక్షల 50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణుగూరు గ్రామానికి సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, అర్హులైన కుటుంబాల గుర్తింపు, ఆర్థిక సహాయం మంజూరు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అధికారులు సమర్పించిన వివరాలను పరిశీలించిన అనంతరం పరిహారానికి ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రాజెక్టు కారణంగా ప్రభావితమవుతున్న కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాసం, పునరుద్ధరణ ప్యాకేజీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. భూసేకరణ, పరిహారం, పునరావాసం అంశాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఓపెన్‌కాస్ట్ విస్తరణతో ప్రభావితమవుతున్న కుటుంబాలకు నిబంధనల ప్రకారం న్యాయం జరగాలని, అర్హులైన లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సింగరేణి మణుగూరు జనరల్ మేనేజర్, భూసేకరణ అధికారి, మణుగూరు తహసీల్దార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ.. స్టడీ మెటీరియల్ పంపిణీ

- **ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **పట్టుదల, క్రమశిక్షణతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలి: ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

పోలీస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.

పోలీస్ శాఖ, సింగరేణి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతులకు మంగళవారం ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలు సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదలతో పాటు నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు.



శిక్షణలో అధ్యాపకులు అందించే సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సమయపాలన పాటించడంతో పాటు ప్రతిరోజూ నిరంతరం సాధన చేయాలని తెలిపారు.

ప్రతి అభ్యర్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని కష్టపడి చదవాలని, పోలీస్ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ, సింగరేణి సంస్థ సంయుక్తంగా అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగాలు పొందాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ ఆపరేషన్స్ బి. రవి, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

భద్రాచలం న్యాయవాదుల ఖ్యాతిని చాటిన ప్రముఖ న్యాయమూర్తులకు ఘన సన్మానం!

- **మండా వెంకటేశ్వరరావు, దేవరపల్లి నాగేశ్వరరావులకు బార్ అసోసియేషన్ ఘన అభినందనలు**
- **యువ న్యాయవాదులకు వీరి ప్రస్థానం ఆదర్శం: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్**

భద్రాచలం, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

భద్రాచలం ప్రాంతం నుంచి న్యాయవాద వృత్తిలో ప్రస్థానం ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నత న్యాయమూర్తులుగా సేవలందిస్తున్న ప్రముఖులను భద్రాచలం బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. న్యాయ రంగంలో ఉన్నత స్థానాలకు ఎదిగి భద్రాచలం ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చిన మండా వెంకటేశ్వరరావు, దేవరపల్లి నాగేశ్వరరావులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ, తమ ప్రాంతం నుంచి న్యాయవ్యవస్థలో ఉన్నత పదవులను అధిరోహించి, నిబద్ధతతో, పారదర్శకతతో విధులు నిర్వహిస్తున్న ప్రముఖులను సన్మానించుకోవడం గర్వకారణమని అన్నారు. భద్రాచలం ప్రాంతంలో జన్మించి, ఇక్కడి వాతావరణంలో ఎదిగి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ ముమ్మనేని సుధీర్‌కుమార్ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతం నుంచి పలువురు న్యాయరంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం స్థానికులకు గర్వకారణమని పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి విలువలను కాపాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో ప్రముఖ న్యాయమూర్తులు అనుసరిస్తున్న విధానం స్ఫూర్తిదాయకమని అన్నారు. భద్రాచలం నుంచి బయలుదేరి రాష్ట్రస్థాయిలో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారి ప్రస్థానం యువ న్యాయవాదులకు ఆదర్శమని కొనియాడారు.

సన్మానాన్ని స్వీకరించిన మండా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తాను న్యాయవాద విద్యను అభ్యసించి వృత్తి జీవితాన్ని ప్రారంభించిన భద్రాచలంలో తోటి మిత్రులు, బార్ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడం అపురూపమైన అనుభూతి అని తెలిపారు. ఇక్కడ అలవర్చుకున్న క్రమశిక్షణ, వృత్తి ధర్మమే తనను ఈ స్థాయికి చేర్చాయని పేర్కొన్నారు. ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా జన్మభూమిని, మూలాలను మరచిపోలేమని, తనను ఆప్యాయంగా సత్కరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



మరో సన్మాన గ్రహీత దేవరపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ గౌరవం వ్యక్తిగతంగా తనకు లభించినదిగా కాకుండా భద్రాచలం బార్ అసోసియేషన్ ఉన్నత సంస్కృతికి నిదర్శనంగా భావిస్తున్నానన్నారు. తాను న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన ప్రాంగణంలోనే న్యాయమూర్తిగా ఎదిగి తిరిగి సన్మానం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సమాజానికి మరింత సేవ చేయడానికి అందరి ఆప్యాయత, ఆదరణ ప్రోత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి, సీనియర్ న్యాయవాదులు ఎస్.కె. అక్తర్, పసుపులేటి రాంబాబు, ముత్యాల రామచంద్రయ్య, కిషోర్, కే. అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పిహెచ్ఎస్ కొమ్మినేపల్లిలో సందడిగా

మాక్ పార్లమెంట్ ఆకట్టుకున్న విద్యార్థుల ప్రసంగాలు

కామేపల్లి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-

మండల పరిధిలోని కొమ్మినేపల్లి పి.ఎం.శ్రీ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పార్లమెంట్' కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయురాలు అరుణ,ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులను కళ్లకు కట్టారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్,స్పీకర్, ప్రైమ్ మినిస్టర్, వివిధ శాఖల మంత్రులు ప్రతిపక్ష నాయకుల వేషధారణలతో పార్లమెంట్ సమావేశాలను తలపించేలా అసలైన వాతావరణాన్ని సృష్టించారు.

ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ విద్యార్థులు రామ్ చరణ్ (స్పీకర్), నవ్య శ్రీ (ప్రెసిడెంట్), సాత్విక్ (వైస్ ప్రెసిడెంట్), శైలజ (హోమ్ మినిస్టర్), హాసిని (ట్రాన్స్పోర్ట్ మినిస్టర్)గా వ్యవహరించగా. తొమ్మిదవ తరగతి విద్యార్థులు సిద్ధార్థ (ప్రైమ్ మినిస్టర్)రోహిత (హెల్త్ మినిస్టర్), హరిని (అగ్రికల్చర్ మినిస్టర్),వర్షిత్ (యూత్ అండ్ వెల్ఫేర్ మినిస్టర్)లుగా తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా పోషించారు. అలాగే విక్రమ్ తేజ్ (ఫైనాన్స్ మినిస్టర్), హరివీర తేజ (అపోజిషన్ మెంబర్)లతో పాటు జోషిక, కళ్యాణి, యామిని, లాస్య, రేణుక, సాయిదివ్య, ఉదయ్ భార్గవ్, నౌసిక్,భార్గవి, మురళి తదితర విద్యార్థులు వివిధ పాత్రల్లో జీవించారు. ఇంగ్లీష్, తెలుగు భాషలలో విద్యార్థులు వ్యక్తపరిచిన వాగ్ధాటి, సమకాలీన అంశాలపై వేసిన ప్రశ్నలు, ఇచ్చిన సమాధానాలు ప్రేక్షకులను తీవ్రంగా ఆలోచింపజేసి, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థుల నుంచి విశేష ప్రశంసలు పొందారు.జె



సీతారామ ప్రాజెక్ట్ కాలువ ప్రతిపాదనను రద్దు చేయాలి

- **తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన కొండాయిగూడెం, కొమ్మినేపల్లి రైతులు**
- **భూములు కోల్పోతే జీవనాధారం దెబ్బతింటుందని ఆవేదన**

కామేపల్లి, నవంబరు10 (భద్రాద్రిన్యూస్):-

సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ లోని కామేపల్లి మండల పరిధిలోని కొండాయిగూడెం, కొమ్మినేపల్లి గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావును కలిసి రైతులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కాలువ నిర్మాణ ప్రతిపాదన వల్ల తమ అమూల్యమైన వ్యవసాయ భూములు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా తమ కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, భూములే తమకు ఏకైక జీవనాధారమని పేర్కొన్నారు. ఒకవేళ కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోతే తమ కుటుంబాలు వీధిన పడటంతో పాటు జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం పునరాలోచించి, తమ గ్రామ పరిధిలో కాలువ నిర్మాణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ,తమ పొలాలను కాపాడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి!

మొదటిపేజీ తరువాయి





వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మొత్తం 1,395 ఎకరాల భూమి ఉండగా, అటవీ శాఖ రికార్డుల ప్రకారం 554 ఎకరాలు అటవీ భూమిగా ఉన్నట్లు అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులు, అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల వినతులను సావధానంగా విన్న కలెక్టర్, రీసర్వే పూర్తయిన అనంతరం భూముల సరిహద్దులు, రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. రైతులు సమర్పించిన వినతులను రికార్డుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం గ్రామస్తులతో మాట్లాడి తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, మొబైల్ నెట్‌వర్క్, రహదారి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాంనగర్ నుంచి పాములపాడు వరకు రహదారి సౌకర్యం లేక అత్యవసర వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 70 కాడస్ట్రల్ గ్రామాలతో పాటు, మ్యాప్‌లు (నక్షాలు) లేని 7 నాన్ కాడస్ట్రల్ గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం ప్రారంభమైన ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 23 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించి, మండల కేంద్రాలకు సమీపంలోని గ్రామాలతో పాటు మారుమూల, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్లు వెల్లడించారు.

మండల కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలను అధికారులు తరచూ సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సౌకర్యం, చేయూత పింఛన్లు తదితర సంక్షేమ పథకాల అమలును ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రజలు తెలియజేసే సమస్యలను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.

రీసర్వే ప్రక్రియలో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భూముల సరిహద్దులు, రికార్డులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే నిర్వహించి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులు, భూ రికార్డులపై స్పష్టత ఏర్పడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

ఈ పరిశీలనలో తహసీల్దార్ నరేష్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సర్వేయర్లు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





సింగరేణిలో కల్చరల్ మీట్ పోటీలు ప్రారంభం!

- **రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఉత్సాహంగా విభాగాలవారీ పోటీలు**
- **కంపెనీ, కోల్ ఇండియా స్థాయిలో కొత్తగూడెం ఏరియా సత్తా చాటాలి: డీవైపీఎం హరీష్**

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ) ఆధ్వర్యంలో కల్చరల్ మీట్ విభాగాల వారీ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ ఆదేశాల మేరకు రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈ పోటీలను నిర్వహించారు.

ఈ పోటీలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీవైపీఎం జి.హరీష్ (గౌరవ కార్యదర్శి), ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జె.గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జి.హరీష్ మాట్లాడుతూ, సంస్కృతి, కళలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడటంతో పాటు వ్యక్తిగత వికాసానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు, కళాకారులు క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయి పోటీల్లో కొత్తగూడెం ఏరియా తరఫున అధిక సంఖ్యలో బహుమతులు సాధించి ఏరియా ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు.

యూనియన్ ప్రతినిధులు పోటీల్లో పాల్గొనే వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్వైజర్ పాస్నెట్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సందబోయిన శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ రాజశేఖర్, క్రీడాకారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



